## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన పోలెపల్లి కళకు అనారోగ్య ఖర్చుల కోసం మంజూరైన రూ.26 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి మాట్లాడారు. కళ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు బండారి సత్యం, ననుమాస కరుణాకర్, నాయకులు పోలెపల్లి భిక్షపతి, శంకేసి రంజిత్, మంచిక సదానందం, వేములపల్లి కుమారస్వామి, ననుమాస కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సైకి సన్మానం



పర్వతగిరి : స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రవీణ్‌ను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు మంగళవారం శాలువాతో సన్మానించారు. తొలుత ఎస్సైని నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మెపా జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల రాజు, ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు కొండ వెంకన్న, కార్యదర్శి రావుల రాజు, డైరెక్టర్ మొగిలి శ్రీనివాస్, చౌటపల్లి సంఘం అధ్యక్షుడు తోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌హెచ్ఆర్‌సీ మండల కన్వీనర్‌గా అభిషేక్



గీసుకొండ : జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సీ) మండల కన్వీనర్‌గా ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన ఐలోని అభిషేక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు గంగుల అశోక్ మంగళవారం నియామక ఉత్తర్వు అందజేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడారు. సంస్థ నియమ, నిబంధనలకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

### మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, తదితర మండలాల్లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించగా ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

### వ్యవసాయ భూమి ఫెన్సింగ్ కడీల ధ్వంసం

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురంలోని తమ భూమిలో రైతులు కన్నెబోయిన ప్రవీణ్, కన్నెబోయిన నాగరాజు వేయడానికి సిద్ధం చేసిన ఫెన్సింగ్ కడీలను కొమ్మాలకు చెందిన బట్టమేకల రాజయ్య, నరేశ్, సురేశ్ పాతకక్షలు దృష్టిలో పెట్టుకుని ధ్వంసం చేశారు. సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని, నిందితులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి గుడుంబా విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నరేశ్‌రెడ్డి మాట్లాడారు. పలు గ్రామాల్లో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై రాజన్న, హెడ్ కానిస్టేబుల్ వజీత్, స్వర్ణలత, నాగరాజు, వినోద్ ఉన్నారు.

### పారదర్శకత పాటించాలి

పర్వతగిరి : మండల కేంద్రంలోని కేజీబీ విద్యాలయలో చేపట్టిన నైట్ వాచ్‌ఉమెన్, స్వీపర్, స్కావెంజర్, హెడ్ కుక్ ఉద్యోగాల నియామకాల్లో పారదర్శకత పాటించాలని ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. అర్హులకు మాత్రమే అవకాశం దక్కాలని ఆయన ఆకాంక్షించారు.

నర్సంపేట : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సంపేట రూరల్ : జిల్లా ఆస్పత్రిలో..



# ఆచార్య జయశంకర్‌కు ఘననివాళి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, పర్వతగిరి, సంగెం, నల్లబెల్లి ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ, వర్ధన్నపేట, రాయపర్తి, చెన్నారావుపేటల్లో మండలాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో, కళాశాలల్లో, పాఠశాలల్లో, జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.



పర్వతగిరి : నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈఓ



సంగెం : నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



చెన్నారావుపేట : సిద్ధార్థ స్కూల్‌లో..



నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు



దుగ్గొండి: కేక్ కట్ చేస్తున్న నాయకులు



వర్ధన్నపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



నెక్కొండ : నివాళులర్పిస్తున్న ఎస్సై మహేందర్



రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో..

# రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- అటవీ గ్రామాల్లో దుస్థితి
- అత్యవసర సేవలకూ ఇబ్బంది

నల్లబెల్లి : రోడ్లు ఇలా ఉన్నాయి.. ప్రయాణం సాగించేది ఎలా? అంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అటవీ పల్లెల్లో వర్షాకాలంలో బురదమయం అవుతున్న రోడ్లపై అత్యవసర సేవలకూ ప్రజలు ఇబ్బంది పడుతున్న దుస్థితి నెలకొంది. మండలంలోని కొండాపూర్ శివారు మురళీనగర్, గణేశ్‌నగర్‌లకు అటవీ పల్లెలుగా గుర్తింపు ఉంది. మురళీనగర్‌లో సుమారు 200, గణేశ్‌నగర్‌లో సుమారు 150 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామాల ప్రజలు అన్ని అవసరాలకూ కొండాపూర్, ఆసరవెల్లి గ్రామాల మీదుగా నల్లబెల్లి, నర్సంపేట ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. మురళీనగర్ నుంచి ఆసరవెల్లికి, గణేశ్‌నగర్ నుంచి కొండాపూర్‌కు 4 కిలోమీటర్ల చొప్పున నడక తప్పని దుస్థితిలో గిరిజనులు వేదనకు గురవుతున్నారు. ఏటా వర్షాకాలంలో అటవీ పల్లెలకు వెళ్లే దారులు బురదమయం కావడం పరిపాటి. ఫలితంగా రవాణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని రెండు దశాబ్దాలుగా అటవీ గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న దాఖాల్లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజులుగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షానికి సైతం రోడ్లు బురదమయంగా మారుతుండడంతో నరకం కనపడుతోందని ప్రజలు వాపోతున్నారు. అటవీ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ఈ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరి చేసింది. అయినా పనులు చేపట్టడం లేదు. ఇటీవల నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కొండాపూర్ గ్రామాన్ని సందర్శించి మురళీనగర్, గణేశ్‌నగర్ గ్రామాలకు రవాణ సౌకర్యం మెరుగుపరుస్తామని, త్వరలో రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని అటవీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మురళీనగర్‌కు వెళ్లే రోడ్డు

### వర్షాకాలంలో చాలా కష్టం



వర్షాకాలంలో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయం అవుతున్నాయి. నడిచి వెళ్లడమూ నరకప్రాయంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లే సమయం లేకపోతుండడంతో వైద్యం కోసం ఆకుపసరుపై ఆధారపడాల్సి వస్తోంది. ఒకసారి వర్షం కురిస్తే కనీసం 20 రోజుల వరకు రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంటోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలి. మురళీనగర్, గణేశ్‌నగర్ గ్రామాలకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

-మాచర్ల శ్రీధర్, మురళీనగర్

# 'అవినీతి ఆరోపణలు హాస్యాస్పదం'

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సొసైటీలో అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండల యాకయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి సొసైటీ గోదాంను శంకుస్థాపన చేసి ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు జరగని అవినీతి చైర్మన్ పార్టీ మారడంతోనే ఎలా జరిగిందని ప్రశ్నించారు. సొసైటీకి గతంలోనూ, ప్రస్తుతం ఒకే పాలకవర్గం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో రైతులు సంబురాలు చేసుకుంటుండగా వారిని పక్కదారి పట్టించేలా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

**దుష్ప్రచారం చేస్తున్న వారిపై కేసులు పెట్టాలి**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కేసులు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని చెప్పారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పార్టీ, ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం



సభ్యత్వ రశీదులతో గఫార్, నాయకులు, ఉపాధ్యాయులు

నెక్కొండ : ఉపాధ్యాయుల, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ పోరాడుతోందని జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్ తెలిపారు. మండలంలో మంగళవారం చేపట్టిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించిన ఘనత సంఘానికే దక్కుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, 50 శాతం పీఆర్సీ ఫిట్‌మెంట్ ప్రకటించాలని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలోతు ప్రతాప్‌సింగ్, కర్ర యాకుబ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

# సత్యాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వెంకటనారాయణ మాట్లాడారు. సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కుల గణన చేసి బీసీల రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు, ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర నాయకుడు శానబోయిన రాజ్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఓరుగంటి కవిత, నాయకులు మచ్చిక రాజుగౌడ్, మండల శ్రీనివాస్, బాల్నె సుభాశ్, గాదం స్వప్న తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**మహేశ్వరంలో..**

నర్సంపేట రూరల్ : మండలంలోని మహేశ్వరంలోని గౌడ సంఘం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశం అనంతరం సత్యాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్‌ను బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా నాయకులు మచ్చిక రాజు, ఆబోతు రాజు యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాజ్‌కుమార్, ఐల్లయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యతత ఇవ్వనున్నట్లు బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గార్లగడ్డతండాకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఆంగోతు వీరన్న, మూడ్ నవీన్, ఆంగోతు సుబ్బు, భానోతు వీరునాయక్, అజ్మీర సంతోశ్, తదితరులకు రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ నాయకత్వంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు.

# 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో అవగాహనే కీలకం



రాయపర్తి : మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఈఓ



వర్ధన్నపేట : పనులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్



దుగ్గొండి: మొక్క నాటుతున్న ఏసీపీ కిరణ్



చెన్నారావుపేట : మొక్క నాటుతున్న సీఐ

రాయపర్తి : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలకు అవగాహన కల్పించడమే కీలకమని జెడ్పీ కార్యనిర్వహణాధికారి (సీఈఓ) రాంరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కొత్తూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన మంగళవారం మొక్క నాటి నీరు పోశారు. అలాగే పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులను సైతం చైతన్యవంతం చేసి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్, ఎంపీఓ కూచన ప్రకాశ్, ఎంఈఓ రంగయ్య, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని, పలు గ్రామాల్లో పరిసరాలను పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. అలాగే ఓహెచ్ఆర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా క్లోరినేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ జోనా పర్యవేక్షించి సూచనలు చేశారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ కిరణ్‌కుమార్ మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతీఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ బుర్రా రాజగోపాల్, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని పంచాయతీ కార్మికులు తొలగించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేశారు. బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రమోహన్ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీవాణి, ఎస్సై గూడ అరుణ్, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఏపీఓ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రమోహన్ మొక్క నాటి మాట్లాడారు. ప్రతీఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమాల్లో ఎస్సై మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ



నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రాబిన్ హుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అనుముల నితీశ్ ఆధ్వర్యంలో సమకూర్చిన పండ్లు, బిస్కెట్లను హెచ్ఎం రవీందర్ పంపిణీ చేశారు. అనంతరం హెచ్ఎం మాట్లాడారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో వారానికి రెండ్రోజులు చొప్పున ఏడాది పాటు విద్యార్థులకు అందిస్తామని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఉడుత రాజు, చెట్టి రమేశ్, గోపి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

**టై, బెల్టులు..**



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన ఎడ్ల నారాయణరెడ్డి, మధుసుధన్‌రెడ్డి వారి తండ్రి నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జీలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వట్టిపెల్లి రమ, చిలువేరు చిరంజీవి, హెచ్ఎం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి



నర్సంపేట : మొక్క నాటుతున్న సీఐ రమణమూర్తి

నర్సంపేట : ప్రతీఒక్కరూ జన్మదిన రోజున మొక్కలు నాటి సంరక్షించాలని సీఐ రమణమూర్తి కోరారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమణమూర్తితో కలిసి పట్టణానికి చెందిన వనప్రేమికుడు, పర్యావరణవేత్త గోకా రామస్వామి అతడి 70వ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. అనంతరం విజ్‌డమ్ స్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు 70 మీటర్ల గ్రీన్ ఫ్లాగ్‌తో పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు చేపట్టిన ప్రదర్శనను సీఐ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడారు. రామస్వామి జన్మదినం సందర్భంగా 70 మీటర్ల గ్రీన్ ఫ్లాగ్‌ను ప్రదర్శించి 70 మొక్కలు నాటడం అభినందనీయని చెప్పారు. తదనంతరం శాంతి వనంలో రామస్వామి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గోకా లీలావతి ట్రస్ట్ నిర్వాహకులు గోకా వినోద్, స్వప్న, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గిరగాని సుదర్శన్ గౌడ్, బెజ్జంకి ప్రభాకర్, కోట డేవిడ్, కాసుల రవికుమార్, మొగిలిచర్ల రాము, కాసుల వెంకటాచారి, బ్రహ్మకుమారి ప్రతినిధులు, విజ్‌డమ్ స్కూల్ ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ ప్రశాంత్, దుగ్గొండికి చెందిన సాహితీ స్కూల్ నిర్వాహకుడు భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శిగా యాదగిరి



వరంగల్: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా అక్కెనపల్లి యాదగిరిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా, నాయకులు రొయ్యల రాజు, గోల్కొండ కుమార్ తెలి పారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ విస్తృతస్థాయి సమావేశం పైడిపల్లి కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్‌నగర్ గౌరవ అధ్యక్షుడిగా రవిరాకుల ప్రసంగి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్‌గా సిలువేరు సుస్మిత, బి ల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ జిల్లా కన్వీనర్‌గా జన్ను ప్ర వీణ్, యువజన సంఘం జిల్లా నాయకులుగా చిట్టి, సుబ్బు, అఖిల్, గీసుకొండ మండల కన్వీనర్‌గా కంది రవి, సంగెం మండల కన్వీనర్‌గా పోలేబో యిన శ్రీనివాస్, వరంగల్ మండల కన్వీనర్‌గా పట్టెం మొగిలి, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శిగా ఎ నుగంటి రాజలింగం, ప ర్వతగిరి మండల కన్వీనర్‌గా ఎస్కే పాషా, న ర్సంపేట మండల కన్వీనర్‌గా శివకుమార్, వర్ధన్నపేట మండల కన్వీనర్‌గా సత్యం ట్రాలీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కన్వీనర్‌గా రాజు, ఆటో జిల్లా కన్వీనర్‌గా గౌస్‌పాషాను ఎన్నుకున్నారు.

### ఉపాధ్యాయులను బదిలీ చేయొద్దు

ఐనవోలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో ఇతర ప్రాంతాలకు బదిలీ చేయొద్దని ఆ గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థుల అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎంఈఓ వెంకటేశ్వర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేస్తారని సమాచారం ఉందన్నారు. గ్రామస్తుల, పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న పాఠశాలను పరిరక్షించాలని ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీశ్‌కుమార్, పూర్వ విద్యార్థుల పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లపెల్లి సురేశ్, రాజారపు రాజ్‌కుమార్, నల్లబెట్ల చిన్న రాజు, బరిగెల భాస్కర్, బరిగెల రాజయ్య, కొండేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.